క్లుప్తంగా

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి దర్శనానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి తమ మొక్కుబడులను భక్తులు చెల్లించుకున్నారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు పట్టి మొక్కుబడులను తీర్చుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో విందు భోజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే గంగమ్మ దేవాలయం సమీపంలోని వీరభద్రస్వామి, శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయాలలో భక్తులు పూజలు నిర్వహించారు.

చల్లంగ చూడమ్మ అంకాలమ్మ తల్లి



ప్రత్యేక అలంకారంలో అంకాలమ్మతల్లి అమ్మవారు

పులివెందుల టౌన్ : పట్టణంలో వెలసిన శ్రీఅంకాలమ్మ తల్లి ఆలయానికి ఆదివారం భక్తులు బోనాలు, కాయ కర్పూరాలు సమర్పించి చల్లంగ చూడమ్మ అంకాలమ్మతల్లి అని వేడుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ భక్తులకు అర్చనలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారికి వెండి మకరతోరణాన్ని అలంకరించారు. భక్తులు అమ్మవారికి చీరలు, గాజులు, నిమ్మకాయల దండలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఆలయ చైర్మన్ నాగేంద్ర ప్రసాద్ పర్యవేక్షించారు.

పులివెందుల రూరల్ : మండలంలోని అచ్చవెల్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు కడప, కర్నూల్, అనంతపురం, చిత్తూరు, రాయచోటి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రతి వారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారీ సంఖ్యలో వస్తుంటారు.

పరామర్శ



మాజీ కౌన్సిలర్ నూరుల్లాను పరామర్శిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నాయకులను మున్సిపల్ వైకాపా ఇన్‌చార్జి మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్‌రెడ్డిలు ఆదివారం పరామర్శించారు. పులివెందుల మాజీ కౌన్సిలర్ నూరుల్లా ఇటీవల కారు ప్రమాదంలో గాయాలు కావడంతో అతని నివాసానికి వెళ్లి పరామర్శించారు. అలాగే వైఎస్సార్ సీపీ 20వ వార్డు కౌన్సిలర్ భర్త నర్సారెడ్డి రెండు మోకాళ్ల ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను తన నివాసానికి వెళ్లి పరామర్శించారు. క్రిస్టియన్ లైన్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రత్నం(65) వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఖాదర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీరుతాగి ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

వేముల : మండలంలోని గొందిపల్లెలో ఆదివారం కలుషిత నీరుతాగి ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన రామశేఖర్‌రెడ్డి పొలంలో సేద్యం చేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో పొలంలో ఎద్దులను నిలబెట్టిన సమయంలో ఎద్దు తెంచుకుని పరుగెత్తింది. దూరంగా ఉన్న కలుషిత నీరు తాగింది. అక్కడికి రైతు వెళ్లే సమయానికే ఎద్దు చనిపోయింది. ఈ సంఘటనలో ఎద్దు మృతిచెందడంతో రూ.60 వేలు నష్టం వాటిల్లిందని రైతు తెలిపారు.

అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయండి

చాపాడు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయవా అని ఏపీ రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఏపీ రమణ ప్రశ్నించారు.

ఆధార్ సెంటర్ లేక అవస్థలు



ఆధార్ సెంటర్‌లో జమ్మలమడుగు వాసులు(ఫైల్)

జమ్మలమడుగు : డివిజన్ హెడ్ క్వార్టర్స్‌లో ఆధార్ సెంటర్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం విద్యాసంవత్సరం మొదలు కావడంతో విద్యార్థులకు తమ ఆధార్ కార్డుల్లో తప్పులను సరిచేసుకునేటందుకు తపన పడుతున్నారు. మరికొంత మంది ఐదు సంవత్సరాల తమ పిల్లలకు నూతన ఆధార్ కార్డు చేయించుకోవాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. గతంలో పట్టణంలో ముద్దనూరు రోడ్డులోని సచివాలయంతో పాటు పోస్టాఫీసు, బ్యాంకుల్లో ఆధార్ సేవలు ఉండేవి. ప్రస్తుతం అక్కడ ఆధార్ సేవలు పూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సైతం తామేమి చేయలేమంటూ చేతులు ఎత్తేస్తున్నారు. ఆధార్ సెంటర్‌లను ఏర్పాటు చేయవలసింది మున్సిపల్ శాఖ, మండల అధికారులే అని సూచిస్తున్నారు. ప్రస్తుతం పట్టణంలో ఒక్క ఆధార్ సెంటర్‌లేకపోవడంతో డివిజన్ కేంద్రంలో ఇలాంటి దుస్థితి వచ్చిందేమిటంటూ స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఆధార్ కావాలంటే పెద్దముడియంకు వెళ్లాల్సిందే

ఆధార్‌కార్డు ఎవరికైనా కావాలంటే త్వరగా పనులు చేసుకోవాలని పెద్దముడియం హెడ్ క్వార్టర్‌కు పరుగులు పెడుతున్నారు. ఆధార్ సెంటర్ కోసం గ్రామీణ ప్రాంతాల ప్రజలు పట్టణం వైపు చూసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారిపోయి గ్రామీణ ప్రాంతమైన పెద్దముడియంకు పట్టణ ప్రజలు పరుగులు తీస్తున్నారు. రోజుకు చాలా మంది ఆధార్‌కార్డుల కోసం, మార్పులు చేర్పుల కోసం పరుగులు తీస్తుంటే రద్దీ పెరిగిపోతుంది. దీంతో అక్కడ ఆధార్‌సెంటర్ యాజమాన్యం అందిన కాడికి దొచుకునే పనిలో పడ్డారు. ఇప్పటికైనా అధికారులు పట్టణంలో సచివాలయాల్లో ఆధార్ సెంటర్‌లను ప్రారంభించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

డివిజన్ కేంద్రంలో ఆధార్ సెంటర్ లేకపోవడం దారుణం



డివిజన్ కేంద్రంలో ఆధార్ సెంటర్ లేకపోవడం చాలా బాధకరం. విద్యార్థులు ఆధార్‌లో మార్పులు చేర్పులు చేసుకోవాలన్న, ఐదు సంవత్సరాలు దాటిన వారికి ఆధార్ కార్డు చేయించుకోవాలంటే పెద్దముడియం మండల కేంద్రంలోనికి వెళ్లవలసి వస్తుంది. దాదాపు 20 కిలోమీటర్ల దూరం వెళ్లవలసి వస్తుంది. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకుని ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయాలి.

– శివకుమార్, డివైఎఫ్ఐ, జిల్లా కార్యదర్శి.

‘ప్రధాని సూర్యఘర్’ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీఈ ప్రసాదురెడ్డి

పులివెందుల రూరల్ : ప్రధాని సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ డీఈ ప్రసాదురెడ్డి, ఏడీ గురుమోహన్‌రెడ్డిలు తెలిపారు. ఆదివారం డివిజన్ కార్యాలయంలో ప్రజా కళావేదిక వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయితీతో మీఇళ్లపై సోలార్ టాప్ నిర్మించుకుని విద్యుత్ ఆదా చేసుకోవచ్చునన్నారు. అలాగే ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని దరఖాస్తు చేసుకోవాలంటే రూ.2 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. అందులో రూ.78 వేలు ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకుంటే బ్యాంకులు కూడా తక్కువ వడ్డీలకు రుణాలు ఇస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఈలు, లైనింగ్ ఇన్‌స్పెక్టర్లు, లైన్ మెన్లు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను భూ స్థాపితం చేయడం ఎవరితరం కాదు

దువ్వూరు : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని భూ స్థాపితం చేస్తామనడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు తగదని, ఇది రాజకీయ ఉన్నత విలువలను భూస్థాపితం చేయడమేనని, జగన్‌ను భూ స్థాపితం చేయడం ఎవరి తరం కాదని వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ఆర్‌టీసీ జోనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం మండలంలోని గుడిపాడు గ్రామంలో సొసైటీ మాజీ చైర్మన్ తుమ్మల మస్తాన్ రెడ్డి ఇంటిలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ వారు వెదవ పనులు చేసినందువల్లే 11 సీట్లు వచ్చాయని చంద్రబాబు మాట్లాడటం ఆయన అహంకారానికి ప్రత్యక్ష నిదర్శనమన్నారు. కూటమి పార్టీలు కలిసి ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ, ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చినా, జగన్ సారథ్యంలో వైఎస్సార్‌సీపీకి 40 శాతం ఓట్లు వచ్చాయన్నారు. జగన్ ఎక్కడికెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. టీడీపీకి 23 సీట్లు వచ్చినప్పుడు ఆ పార్టీ వారు వెదవ పనులు చేసినట్లు ముఖ్యమంత్రి అంగీకరిస్తారా అన్నారు. రాజమండ్రి ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి వయసుపైబడి అహంకారంతో జగన్‌ను ఉద్దేశించి.. ‘నీ తల నరికొచ్చుగా’ అనడం రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగంగా మాట్లాడినట్లా అని ప్రశ్నించారు. జగన్‌కు వెంటనే బుచ్చయ్య చౌదరి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్‌పై కూటమి నేతలు ఇలాంటి నీచపు మాటలు మాట్లాడుతున్నారని, జగన్ ఏదైనా మాట్లాడితే తప్పుగా చిత్రీకరించి విషం చిమ్ముతున్నారని పేర్కొన్నారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు చెప్పిన పథకాలన్నీ మాట తప్పకుండా, మడమ తిప్పకుండా ప్రజలకు అందించారన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా తల్లులకు, రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పారిశుద్ధ్య సిబ్బంది.. పట్టించుకోండి



అంగన్‌వాడీ కేంద్రం పక్కన ఉన్న చెత్తాచెదారాలు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని మల్లికార్జునపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం పక్కన ఎక్కడ పడితే అక్కడ చెత్త ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నపిల్లలు ఉండటంతో తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో దోమలు వృద్ధిచెంది రోగాలు వస్తాయని వాపోతున్నారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద అపరిశుభ్రంగా ఉన్న సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ ఉన్న చెత్తా చెదారాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

కుందూతీరం.. పంట సాగుకు సిద్ధం

కుందూతీర గ్రామాల్లోని రైతులు వరిసాగు చేసేందుకు కొంతమంది రైతులు మాత్రమే జీలుగ పంటను వేశారు. ఇంకో వారం, పది రోజుల్లో నారుకయ్యలు సాగు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. ముందుగా పచ్చిరొట్టిగా జీలుగ విత్తనాలను చల్లడంతో పొలాలు పచ్చగా కనిపిస్తున్నాయి. అయితే కుందూనదిలో నీరు అరకొరగా వస్తున్నాయని, నదిలో నీరు పెరిగితే వరిపంట సాగు చేసినా ఇబ్బందులు ఉండవని చెబుతున్నారు. ఏదిఏమైనా పంట దిగుబడులు వచ్చాక ధర, దిగుబడి లేక గతేడాది ఈపంట సాగు చేసిన రైతులు నష్టాన్ని చవిచూశారన్నది ముమ్మాటికి నిజం. ఈఏడాదైనా ధర, దిగుబడులు బాగా రావాలని కోరుకుంటూ కోటి ఆశలతో పంటసాగు చేస్తున్నామని అక్కడి రైతులు చెబుతున్నారు.

– రాజుపాళెం



కుందూతీర పరిధిలో జీలుగను వేసిన రైతులు



వెలవలి వద్ద కుందూనదిలో ప్రవహిస్తున్న నీరు



కుందూనది నీటిని పొలాలకు అందిస్తున్న రైతులు

మైలవరంలో 108 సేవలు బంద్



మరమ్మతుల కోసం కడపకు వెళ్లిన 108 సర్వీసు

జమ్మలమడుగు : మైలవరం మండలంలో 108 సేవలు నిలిచిపోయాయి. కొంతకాలంగా 108 వాహనం మరమ్మతులకు గురికావడంతో సేవలు ఆగిపోయాయి. నాలుగు రోజుల క్రితం మైలవరం నుంచి వాహనాన్ని కడపకు తరలించారు. మరమ్మతులకు ఖర్చు ఎక్కువ అవుతోందని జిల్లాస్థాయి అధికారులు పూర్తిగా పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మండలంలో ప్రజలకు అత్యవసర పరిస్థితులు వస్తే పెద్దముడియం లేదా జమ్మలమడుగు పట్టణంలోని 108 సర్వీసులను వాడుకోవలసి వస్తుంది. స్థానికంగా 108 సర్వీసు లేకపోవడంతో మండల వాసులకు ఇబ్బందులకు గురి అవుతున్నారు. జిల్లాస్థాయి అధికారులు జోక్యం చేసుకుని 108 సేవలను కొనసాగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రాణాయామం ఆయుష్షు పెంచుతుంది

పోరుమామిళ్ల : ప్రాణాయామం నిత్య సాధన చేయడంతో ఆయుష్షు పెరుగుతుందని యోగా గురువు గురివిరెడ్డి పేర్కొన్నారు.

స్థానిక సత్యసాయి ఫంక్షన్ హాల్‌లో జరిగిన వాసవీ క్లబ్, వనితా క్లబ్ సంయుక్త సమావేశంలో యోగా గురువు గురివిరెడ్డి యోగా విశిష్టత, ప్రయోజనాలు వివరించారు. మహిళలతో యోగ సాధన చేయించారు. యోగా సాధనతో రోగాలకు దూరంగా, ఆరోగ్యంగా జీవించవచ్చని వివరించారు. అనంతరం గురివిరెడ్డిని శాలువా, పూలదండతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ(భీమవరం), మోటపోతుల శివ, పవన్‌కుమార్, పద్మనాభయ్య, సత్యనారాయణ, వెంకటసుబ్రహ్మణ్యం, కృష్ణవేణి, అమ్మణ్ణి, సభ్యులు పాల్గొన్నారు.

నేడు నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలి

పులివెందుల టౌన్ : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సోమవారం జరిగే ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ బృతిపై జరిగే శాంతియుత ర్యాలీని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ పులివెందుల నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు రామ్‌లక్ష్మణ్ రెడ్డి పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. నీకు 15వేలు నీకు 15వేలు, మహిళలకు నీకు 18వేలు నీకు 18 వేలు అనీ ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి హామీ ఇచ్చి ప్రజలందరిని మోసం చేశా రన్నారు. నిరుద్యోగులకు కూడా రూ.3వేలు ఇస్తాన ని నమ్మించి మోసం చేశారన్నారు. రేపు కడప కలెక్టరేట్ కార్యాలయానికి యువత, విద్యార్థులతో కలసి నిరసన కార్యక్రమం చేపడుతున్నామని..అందుకు ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నారా లోకేష్ యువగళం పేరుతో ఎక్కడ ఏ విధంగా హామీలిచ్చి మభ్యపెట్టారో అందరికి తెలుసన్నారు. వలంటీర్ వ్యవస్థకు రూ.10వేలు ఇస్తామని మోసం చేశారన్నారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకపోతే రానున్న రోజుల్లో మా ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో యువజన విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో

చింతకొమ్మదిన్నె : కూటమి ప్రభుత్వం యువతకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం అయిందని దీనికి నిరసనగా సోమవారం చేపట్టనున్న యువత పోరు కార్యక్రమం జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ యువజన అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌వద్దకు నిరుద్యోగ యువత, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, గురువులు

కొండాపురం : మండలంలోని లావనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1992–93 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 32 ఏళ్ల తర్వాత ఒక్క చోట కలుసుకుని ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ చదువుతో ఈ రోజు వివిధ స్థాయిల్లో ఉన్నామన్నారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు చెప్పిన అనాటి గురువులు మాట్లాడుతూ సమాజంలో వివిధ ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు చెసుకుంటున్నారని చెప్పడం మాకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఏస్థాయిలో ఉన్నా తల్లిదండ్రులకు మాత్రం ఆశ్రయం ఇచ్చి మంచిగా చుసుకోవాలన్నారు. తల్లిదండ్రులను ఆశ్రమాల్లో పెట్టకూడదని పూర్వ విద్యార్థులకు సూచించారు. ఆనాటి గురువులు చెంచిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, వీరనారాయణరెడ్డి, రామంజులరెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రస్తుత ఎంఈఓలు ఓబులేసు, రామయ్యలు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు సీఐగా నారాయణరెడ్డి, రెవెన్యూఇన్‌స్పెక్టర్ గామహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : మండలంలోని పెద్దకూడాల పాఠశాలలో ఆదివారం 1985 బ్యాచ్‌కు సంబంధించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు కొండ్రెడ్డి, వీరారెడ్డి, వెంకటలక్ష్మమ్మలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వపు విద్యార్థులు రాజశేఖర్ రెడ్డి, పద్మనాభరెడ్డి, పారిశ్రామిక వేత్త రాజగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పాఠశాల అభివృద్ధి రూ. లక్ష విరాళంగా అందజేశారు.



లింగాల : పూర్వ విద్యార్థులతో అప్పటి గురువులు

చట్టాలపై అవగాహన ఉండాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి ఎస్.భార్గవి

కొండాపురం : న్యాయ విజ్ఞాన సదస్సుల ద్వారా వెనుకబడిన వర్గాల విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.బార్గవి తెలిపారు. మండలంలోని ఓబన్నపేట కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన మండల న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. లోక్ అదాలత్ రూపంలో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఉచిత న్యాయ సహాయం, గృహహింస చట్టం పలు చట్టాలతోపాటు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే మహిళలకు వివాహాలు చేయాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీ, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలి

మైదుకూరు : ఇల్లు లేని నిరుపేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని ఎన్ని సార్లు కోరినా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్.నాగసుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జీవీ సత్రంలో పేదలకు ఇళ్ల స్థలాలు, భూములు దక్కే వరకు పోరాటాలు చేయాలనే అంశంపై సీపీఐ రూరల్ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాలుగా పేదలు పేదలుగానే ఉంటూ, పేదలుగానే మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల దాచుకోవడానికి 2 సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని కోరుతూ రెవెన్యూ కార్యాలయం చుట్టు తిరుగుతున్నా స్పందించడం లేదన్నారు. బలవంతులు ఎకరాలకు ఎకరాలు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తుంటే ప్రభుత్వాలు, అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. పేద ప్రజలు కూడా భూ పోరాటాలకు సిద్ధమై ఇంటి స్థలాలు, భూములను సాధించుకోవాలని అన్నారు. మహాసభలో సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి పి.శ్రీరాములు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్, షావలి, పీరయ్య తదితరులు పాల్గొన్నారు.